

## ఎల్లమ్మ శాపం

ముడుమాల్ నిలువురాళ్ల గురించి స్థానికంగా ఓ ఆసక్తికరమైన కథ ప్రాచుర్యంలో ఉంది. చాలా ఏళ్ల క్రితం అక్కడి ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా బతికేవారు. వాళ్లకు ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలు కూడా ఉండేవి. వ్యవసాయ పనులు ఉన్న రోజుల్లో వాటిని చూసుకునేవాళ్లు



ఎవరూ ఉండేవారు కాదు. దీంతో ఆ రైతులు అక్కడ ఉన్న ఎల్లమ్మ తల్లి దగ్గరకు వచ్చి.. 'చేను పనుల్లో తీరిక లేదు. మా బర్లు, గొర్లను పొద్దుగూకేదాంక నువ్వే చూసుకో. నీకు బుట్టెడు బంగారు నాణేలు ఇస్తాం' అని మొక్కుకున్నారట. ఎల్లమ్మ ఆ పశువులను చూసుకున్నదట. బుట్టలో ఊక నింపి పైన బంగారు నాణేలు పెట్టి మొక్కు చెల్లించుకున్నారట. ఎల్లమ్మ బుట్టలో చేయి పెట్టగానే ఊక తగిలిందట! కోపోద్రిక్తురాలైన ఎల్లమ్మ తల్లి 'నన్నే మోసం చేస్తారా! మీరంతా రాళ్లుగా మారిపోండి' అని శపించిందట. వాళ్లంతా నిలువురాళ్లుగా మారిపోయారని, పశువులు బండరాళ్లుగా మారిపోయని స్థానికులు విశ్వసిస్తారు. అంతేకాదు ఆ రాళ్లను కదిలిస్తే రక్తం కక్కి చచ్చిపోతారని, ఆ ప్రయత్నం చేసినవాళ్లు కొందరు అలాగే చచ్చిపోయారని నమ్ముతున్నారు. అందుకే వాటికి అపకారం తలపెట్టలేదు. నిలువురాళ్ల దగ్గర ఎల్లమ్మతోపాటు ఓ నిలువురాయిని తిమ్మప్పగా పూజిస్తుంటారు. తిమ్మప్ప సన్నిధిలో పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయిస్తుంటారు. నవ వధూవరులతో ప్రత్యేక పూజలు చేయిస్తుంటారు.

అవగాహన తర్వాత నిలువురాళ్లు, సమాధులు, ఖగోళ సంబంధమైన చిహ్నాలను కాపాడేందుకు పూనుకొంది. సుదీర్ఘ కాలంగా ఈ నిలువురాళ్ల గుట్టు విప్పేందుకు పరిశోధనలు చేస్తున్న కేపీ రావుతో కలిసి డీహెచ్ఏటీ ఆధ్వర్యంలో ముడుమాల్ పరిరక్షిత ప్రదేశాన్ని ఫొటోగ్రామెట్రిక్ సర్వే డ్రోన్‌తో డాక్యుమెంట్ చేశారు. బృహత్ శిలాయుగపు ఆనవాళ్లు ఉన్న ఎనభై ఎకరాలతోపాటు చుట్టూ 500 ఎకరాల్లోని పరిసరాలు, పర్యావరణం, కృష్ణానదిని ఈ సర్వేలో డాక్యుమెంట్ చేశారు. ఇరవై ఎకరాలలో ఉన్న ప్రతి బంతిరాయికీ, నిలువురాయికీ నంబర్ కేటాయించారు. ఈ సంఖ్య ఆధారంగా ప్రతి రాయినీ అన్ని కోణాల్లో ఫొటోలు తీయించారు. రెండున్నర సెంటీమీటర్ల పరిమాణంలో ఉండే వస్తువు కూడా స్పష్టంగా కని



పించేలా హై రెజల్యూషన్ ఉన్న కెమెరాలు ఉపయోగించి డ్రోన్ సర్వే చేయించారు. డ్రోన్ సర్వే, స్టోన్ నంబర్ల ఆధారంగా నక్షా రూపొందించారు. ఎవరైనా ఒక రాయిని జరిపినా ఇకముందు ఏ ప్రమాదం లేదు. ఆధార్ కార్డ్ మనిషి పుట్టుపూర్వోత్తరాలు పట్టిచ్చినట్టు రాయిని పూర్వం ఉన్న ప్రదేశంలో, అదే దిక్కుల్లో పెట్టేందుకు ఈ డిజిటలైజేషన్, స్టోన్ నంబర్ ఉపయోగపడతాయి.

### చలో ముడుమాల్

చెట్ల తొర్రల్లో, రాతి గుహల్లో నివసించిన మూడువేల సంవత్సరాల నాటి ఆ మానవులు లేరు. కానీ, వాళ్లు విడిచిపోయిన ఆనవాళ్లున్నాయి. ఆ ఆనవాళ్లపై వాళ్లు సాగించిన ఖగోళ పరిశోధనల గుర్తులున్నాయి. మానవ చరిత్రలో గ్రహాన్ని గుర్తించిన మొట్టమొదటి చారిత్రక ఆధారం వాళ్లు విడిచివెళ్లారు. ప్రపంచంలో నక్షత్ర మండలాన్ని మొట్టమొదటిసారి కచ్చితంగా నమోదు చేసి, ఘనమైన వారసత్వాన్ని మనకు వదిలి వెళ్లారు. వాతావరణ మార్పులకు, ప్రకృతి విపత్తులకు తట్టుకుని యుగయుగాలుగా వర్ధిల్లిన ఈ వారసత్వ సంపదను కాపాడుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. అడవిగాచిన వెన్నెలలా శతాబ్దాల నిర్లక్ష్యంతో ధ్వంసమైన ఈ ప్రాచీన మానవుల ఆనవాళ్ల సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం పూనుకొన్నది. ఆధునిక మానవుడి నుంచి ముప్పు జరగకుండా కాపాడుకునే ప్రయత్నమే కాదు, ఈ పురా పరిశోధనలకు ప్రపంచ వారసత్వంగా పట్టంకట్టే ప్రయత్నాలూ మొదలయ్యాయి. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సంకల్పం, తెలంగాణ ప్రభుత్వ కృషితో ముడుమాల్ నిలువురాళ్లు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందడానికి అడుగు దూరంలో నిలిచాయి. కాంతి సంవత్సరాల దూరంలోని నక్షత్రాల విన్యాసాన్ని, గ్రహగతులను ఆదిమానవుడు గుర్తించినా, ఆ ప్రతిభను ఆ ఆనవాళ్లకు సమీపంలో ఉన్న ఆధునిక మానవులు గుర్తించక పోవడం మరో విచిత్రం. ఇప్పటికైనా పోదాం పదండి ముడుమాల్‌కు. మన పూర్వికుల అడుగులో అడుగేసి, వాళ్ల ఊహలు చిత్రించిన అంతరిక్షాన్ని చూసొద్దాం! ■



## మూడేళ్లలో వారసత్వ హోదా

ముడుమాల్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం తెలంగాణ హెరిటేజ్ డిపార్ట్‌మెంట్‌ని కోరాం. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)ని సంప్రదించాం. ఏఎస్ఐ భారతదేశం తరఫున 10 ప్రదేశాలకు వారసత్వ హోదా కావాలని దరఖాస్తు చేసింది. icomas ఈ ప్రదేశాల చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక విశేషాలను అధ్యయనం చేసి వారసత్వ యునెస్కోకి సలహా ఇస్తుంది. icomas ఇండియా యూనిట్‌లో నేను సభ్యుడిగా చాలా కాలం నుంచి పనిచేస్తున్నాను. ఆ అనుభవంతో ముడుమాల్ సంరక్షణ, పునరుద్ధరణ పనులను యునెస్కో ప్రమాణాలకు అనుగుణంగానే మొదలు పెట్టాం. అందువల్లే యునెస్కో వారసత్వ కట్టడాల టెంటేటివ్ లిస్ట్ (తాత్కాలిక జాబితా)లో ముడుమాల్‌కు చోటు దక్కింది. ముడుమాల్ నిలువురాళ్ల ప్రాంతాన్ని సంరక్షించే ప్రయత్నాలు చేస్తున్నాం. ఏ ఒక్కరాయికీ నష్టం జరగకుండా కాపలా కాస్తున్నాం. మూడేళ్లలో యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల (శాశ్వత) జాబితాలో ముడుమాల్ నిలువరాళ్లకు చోటు దక్కేలా పనిచేస్తాం.

**- ఎం. వేదకుమార్,**
దక్కన్ హెరిటేజ్ అకాడమీ
వ్యవస్థాపక చైర్మన్

